

శాకంబరిగా గంగాలమ్మ

నరసాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బిచర్లలో గంగాలమ్మను ఆదివారం శాకంబరిగా అలంకరించారు. అమ్మ వారి దర్శనానికి అలంకరణ చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకు ముందు అమ్మవారికి భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీచ్‌లో సందడి

మొగల్తూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం, కేపీ.పాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఎండ తీవ్రతతో సేద తీరడానికి యువకులు బీచ్‌కు తరలివచ్చారు. ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలల మధ్య ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీరంలో మత్స్యనారాయణస్వామి, షిరిడి సాయిబాబా, 54 అడుగుల అభయాంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి, పాండురంగ స్వామి, వేళాంకిణి మాత ఆలయాలను పర్యాటకులు సందర్శించారు.



పీ4 సర్వే



- జిల్లాలో 64,904 కుటుంబాల గుర్తింపు
- మరోసారి సర్వే
- అధికారుల కమిటీ
- వివరాల సేకరణ

భీమవరం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పేదలను ఆర్థికంగా బలోపేతంగా చేయడానికి ప్రభుత్వం పీ 4 సర్వే చేపట్టింది. సర్వే ద్వారా 20 శాతం బీపీఎల్ కుటుంబాలను గుర్తించి వారిని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేలా ప్రణాళికను రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 64,904 కుటుంబాలను గుర్తించినప్పటికీ మరోసారి సర్వే నిర్వహిస్తున్నారు. ఎవరైనా అనర్హులున్నా, లేక అర్హులు చేరలేదా అనేది పరిశీలించి నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శకులను ఎంపిక చేయనున్నారు. పీ4 సర్వేలో సచివాలయ కార్యదర్శులు కీలకంగా వ్యవహరించనున్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు, ఎన్ఆర్ఐ, పారిశ్రామికవేత్తలు, గ్రామ పెద్దలు, రిటైర్డ్ ఉద్యోగులను గ్రామాల వారీగా, పట్టణాల్లో ఎంపిక చేసి బంగారు కుటుంబాలతో సమావేశం ఏర్పాటుచేసి వారి ఆదుకునేలా చర్యలు చేపట్టనున్నారు. ఎంపిక చేసినవారికి మార్గదర్శకులు సాయం అందించి ఆర్థికంగా బలోపేతం చేయూతనిచ్చే చర్యలు తీసుకోనున్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

పీ4 కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతమయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించారు. 20 మండలాలకు 20 మంది ప్రత్యేక అధికారులను నియమించగా మునిసిపాల్టీలకు మునిసిపల్ కమిషనర్లను అధికారులుగా నియమించారు. ప్రత్యేక అధికారులు మండల స్థాయి, వార్డుల్లో బంగారు కుటుంబాల గుర్తింపుతోపాటు మార్గదర్శకుల వివరాల సేకరణ తదితర అంశాలపై చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

గ్రామ కమిటీ : గ్రామస్థాయి కమిటీలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, స్థానిక రిప్రజెంటేటివ్, స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఉంటారు.

మండల స్థాయి : తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, మండల వ్యవసాయాధికారి, ఇతర అధికారులతో కమిటీ ఉంటుంది.

కమిటీలు గ్రామ, వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేసి బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను మ్యాపింగ్ చేస్తారు. కమిటీ సమావేశాలు ఈనెల 31 లోగా పూర్తిచేసి నూరుశాతం దత్తత పూర్తయ్యేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



జువ్వలపాలెంలో ఆర్‌యూబీ నిర్మించనున్న ప్రాంతం

ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాలకు
గ్రీన్ సిగ్నల్

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఆర్‌వోబీ (రైల్వే ఓవర్‌బ్రిడ్జి), ఆర్‌యూబీ (రైల్వే అండర్‌బ్రిడ్జి)ల నిర్మాణానికి రైల్వే అధికారులు అనుమతించారు. బ్రిడ్జిలు నిర్మించాల్సిన ప్రాంతాలపై ఉన్నతాధికారుల బృందం నివేదికలు తయారు చేశారు. ఆర్అండ్‌బీ అధికారుల చర్చించి అనుమతి మంజూరు చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చొరవతో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ రైల్వే అధికారులను సమన్వయం చేసి బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతి సాధించారు.

- మొత్తం నాలుగు బ్రిడ్జిల నిర్మాణం
- రైల్వే శాఖ అనుమతి మంజూరు
- గ్రామాలకు రవాణా సులభతరం
- నియోజకవర్గ అభివృద్ధికి సోపానం

తాడేపల్లిగూడెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 2 ఆర్‌వోబీలు, 2 ఆర్‌యూబీల నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే పట్టణంలో 2 ఆర్‌వోబీలు ఉండగా ఆర్‌యూబీలు లేవు. నియోజకవర్గంలో ఒకేసారి నాలుగు ప్రాజెక్టులకు అనుమతి లభించడంతో ప్రజలు, వ్యాపార వర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తాడేపల్లిగూడెం పట్టణం రావాలంటే వాహనదారులు ఇబ్బందులు పడేవారు. పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌ను నియంత్రణపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ బ్రిడ్జిల నిర్మాణానికి మార్గ సుగమైంది. నిర్మాణానికి నిధులు పూర్తిగా రైల్వే శాఖ కేటాయించనుంది. ఆర్అండ్‌బీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాటు చేయనున్నారు.

ఆర్‌వోబీల నిర్మాణం ఇక్కడ

మండలంలోని నవాబ్‌పాలెం వద్ద ఒక ఆర్‌వోబీ, ఆరుళ్ల నుంచి జగన్నాధపురం రోడ్డులో మరో ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టనున్నారు. దీనితో తాడేపల్లిగూడెం

మిగతా 8వ పేజీలో



నియోజకవర్గం మరింత అభివృద్ధి

ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణంతో నియోజకవర్గం మరింత అభివృద్ధిపథంలో నడుస్తుంది. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సహకారం మరువలేనిది. ఆయన కృషితో రైల్వే బ్రిడ్జిల ఏర్పాటు సాధ్యమైంది. అన్ని రంగాల్లో ముందున్న తాడేపల్లిగూడెం ప్రాంతానికి ఈ బ్రిడ్జిలతో రావడంతో భవిష్యత్‌లో మరింత అభివృద్ధి సాధ్యం.
బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్,

రైల్వే శాఖ స్పందన బాగుంది

నియోజకవర్గ పరిధిలో నాలుగు ప్రాజెక్టులు ఇవ్వడం శుభపరిణామం. తాడేపల్లిగూడెం పట్టణం విస్తరిస్తున్న దృష్ట్యా ఇలాంటి నిర్మాణాల ఆవశ్యకత ఎంతో ఉంది. రైల్వే స్టేషన్‌ను మరింత విస్తరించే దిశగా రైల్వే అధికారులు కృషి చేస్తున్నారు. దానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నిరంతం శ్రమిస్తున్నారు.
రవి అగర్వాల్, జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు



రియల్ జోష్

ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు అనుమతి లభించడంతో రియల్ ఎస్టేట్ మంచి ఊపు అందుకుంది. ప్లాట్లు, పొలాల ధరలకు రెక్కలొచ్చాయి. విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, పొలాల సమాచారం సేకరించి కొంత మంది రియల్టర్లు క్యాష్ చేసుకుంటున్నారు. ప్రధానంగా జువ్వలపాలెం, కుంచనపల్లి మధ్య ఇటీవలి ప్లాట్లు జోరుగా అమ్ముడుపోతున్నాయి. జువ్వలపాలెం నుంచి కుంచనపల్లి మీదుగా హైవేకు 60 అడుగుల రోడ్డు ప్లాన్‌లో ఉండడంతో దీన్ని మరింత విస్తరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మిస్తే చుట్టుపక్కల పొలాలకు, ప్లాట్లకు మరింత డిమాండ్ పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. మరిన్ని లేఅవుట్లు ఏర్పాటుకు రియల్టర్లు పావులు కదుపుతున్నట్లు సమాచారం. గతంలో యాగర్లపల్లి నుంచి హౌసింగ్‌బోర్డుకు బ్రిడ్జి, రోడ్ల నిర్మాణంతో అక్కడ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పట్టణానికి చేరువలో ఉన్న జువ్వలపాలెం వద్ద ఆర్‌యూబీ నిర్మాణంతో ధరలు అమాంతం పెరుగుతాయని రియల్టర్లు ప్రచారం చేస్తున్నారు.

కుంచనపల్లిలో
మ్యాజిక్ డ్రెయిన్
జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక



కుంచనపల్లిలో రోడ్డుపై మురుగు

- ఇంకుడు గుంతలతో డ్రెయిన్
- మురుగు సమస్యకు చెక్
- కార్యాచరణ సిద్ధం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచనపల్లి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. తక్కువ ఆదాయం కలిగిన గ్రామాలకు మ్యాజిక్ డ్రెయిన్లు వరంగా మారనున్నాయి. ఈ తరహా మేజిక్ డ్రెయిన్ ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరంలో ప్రయోగాత్మకంగా నిర్మించారు. వీటి ద్వారా గ్రామాల్లో మురుగునీటి సమస్య పరిష్కరించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

జిల్లాలో తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఉపాధి హామీ పథకం జిల్లా స్థాయి అధికారులు గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. మెట్ట, డెల్టా ప్రాంతాల వాతావరణం ఉన్న కుంచనపల్లిలో ఈ ప్రాజెక్టు ప్రయోగాత్మకంగా నిర్వహిస్తే జిల్లా అంతటా ఈ ఫలితాల ద్వారా ముందుకు వెళ్లవచ్చని డ్వామా అధికారులు భావించారు. గ్రామంలో 6వేల జనాభా, 1650 గృహాలు ఉన్నాయి. గ్రామంలో మురుగు నీరు రోడ్లపైకి ప్రవహించడంతో నీటి కాలుష్యం పెరుగుతోంది. మ్యాజిక్ డ్రెయిన్ ఏర్పాటుచేసి ఆ సమస్య పరిష్కరించి విజయవంతంగా జిల్లా అంతటా ప్రారంభించేందుకు వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు.

గ్రామంలో 400 మీటర్లలో ఉపాధి హామీ పథకంలో కచ్చా డ్రెయిన్, ఇంకుడు గుంతలు తవ్వేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ డ్రెయిన్ ద్వారా ఆ ప్రాంతంలో మురుగునీటి సమస్య పోవడంతో పాటు తరచూ డ్రెయిన్లు శుభ్రంచేసే అవసరం ఉండదు. గ్రామం మురుగునీరు రహితంగా తయారుకానుంది.

మ్యాజిక్ డ్రెయిన్ అంటే..

మురుగునీరు ఇంకుడు గుంతలకు మళ్లించి.. శుభ్రంచేసి వాటిని భూగర్భ జలాలకు మళ్లించేవిధంగా డ్రెయిన్ నిర్వహించనున్నారు. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటుచేసి అక్కడ నుంచి కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేస్తారు. మురుగు రోడ్లపైకి రాకుండా ఇంకుడు గుంతల్లో చేరుతుంది. రోడ్డుపై మురుగు లేకుండా చేసేదే ఈ మ్యాజిక్ డ్రెయిన్.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు
బిల్లుకు అదనంగా ఎటువంటి చార్జీలు ఉండవు
ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

నరసాపురానికి ప్రత్యేక రైలు 7
బెంగళూర్, అర్సికెరె, అరుణాచలం వీక్లీ స్పెషల్

కుట్టు..మహిళల ఉపాధికి మెట్టు
మహిళల ఆర్థిక ఉన్నతికి టైలరింగ్ శిక్షణ



శిబిరం ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, మంత్రి నిమ్మల


దివ్యాంగులకు రూ.2 కోట్లు

- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

పాలకొల్లు టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ద్వారా రూ.2 కోట్లతో ఉపకరణాలు అందజేయనున్నట్లు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల గుర్తింపు శిబిరం ఆదివారం కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. శ్రీనివాసవర్మ మాట్లాడుతూ తొలుత రూ.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్, ఆర్డీవో దాసి రాజు, మునిసిపల్ కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.

మరణంలోను తోడుగా..

గంట వ్యవధిలో దంపతుల మృతి.. చాట్రాయి మండలం పోలవరంలో విషాదం





వెంకటేశ్వరరావు, పాప(ఫైల్)

చాట్రాయి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు గంట వ్యవధిలో భార్యా భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో మండలంలోని పోలవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం చేస్తున్న తేళ్లూరి వెంకటేశ్వరరావు(65), తేళ్లూరి పాప(55) ఒకే రోజు కన్నుమూయడం కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. పాప కొన్ని నెలల క్రితం కేన్సర్ బారిన పడడంతో భర్త, కుమారుడు, కుటుంబ సభ్యులు తాహతును మించి ఖర్చు పెట్టి చికిత్స చేయిస్తున్నారు. ఈ లోగా భర్త వెంకటేశ్వరరావుకు ఊపిరితిత్తులలో సమస్య రావడంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం భార్య పాప పరిస్థితి విషమించి చనిపోయింది. కళ్ల ముందే భార్య చనిపోవడంతో కలత చెందిన వెంకటేశ్వరరావు గంట వ్యవధిలోనే తుదిశ్వాస విడిచాడు. వారి పెద్ద కుమారుడు మూడేళ్ల క్రితం కేన్సర్‌తో మృతి చెందాడు. రెండో కుమారుడు కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు అండగా ఉంటున్నాడు. కుమార్తెకు వివాహమైంది. భార్యాభర్తలు ఇద్దరూ ఒకేసారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

పుట్టినరోజు విషెస్ చెప్పలేదని
భార్య ఆత్మహత్య
భర్త ఆత్మహత్యాయత్నం 7లో
అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
చొదిమెళ్లలో ఘటన.. ఇద్దరూ టీచర్లు

నరసాపురానికి ప్రత్యేక రైలు



నరసాపురం,జూలై 20 (ఆంధ్రజ్యోతి): నరసాపురం స్టేషన్‌కు ప్రత్యేక రైలు కేటాయించారు. 20 కోచ్‌లతో ఉండే ఈ రైలు బెంగళూర్, అర్సికెరె, అరుణాచలం (తిరువణ్ణామలై) వీక్లీ స్పెషల్‌గా నడుస్తున్నది. ఈ రైలు నిర్వహణ అంతా నరసాపరం స్టేషన్‌లోనే చేస్తున్నారు. ఆదివారం ఈ రైలు బెంగళూరు మీదుగా అర్సికెరె వెళ్లతుంది. బుధవారం అరుణాచలం, శుక్రవారం రేణుగుంట మీదుగా యశ్వంత్‌పూర్ వెళుతుంది. ఇలా వారంలో మూడు ట్రిప్పులు, మూడు ప్రాంతాలకు నడుస్తోంది. అయితే మంచి డిమాండ్ ఉన్న రూట్లలో నడపడం వల్ల రెండు నెలల ముందుగానే టిక్కెట్లు నిండు కుంటున్నాయి. అరుణాచలం ఆగస్టు వరకు, యశ్వంత్‌పూర్‌కు ఆగస్టు వరకు ఫుల్ అయ్యాయి. ప్రస్తుతం వారానికి ఒక్క రోజు నడుస్తున్న ఈ స్పెషల్ రూట్లలో అదనంగా మరో రైలు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. నరసాపురం స్టేషన్‌కు మరో రైలు కేటాయిస్తే వారంలో రెండు ట్రిప్పులు ఈ రూట్లలో స్పెషల్ రైళ్లు నడిపేందుకు అవకాశం ఉంటుంది.



విజేతలకు బహుమతులు అందిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

భీమవరం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) :యోగా సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను ఒక దినచర్యగా చేసుకోవాలని కేంద్ర మంత్రి భూప తిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం బైపాస్ రోడ్డులో ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి యోగాసన పోటీలను భాష్యం పాఠశాలల్లో నిర్వహించారు. పోటీల్లో గెలు పొందిన వారంతా త్వరలో విజయవాడలో జరుగునున్న రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు అర్హత సాధించారని అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రశంసా పత్రాలను అందించారు. కంతేటి వెంకటరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, కలిదిండి రామకృష్ణ, ఉప్పలపాటి వెంకటేశ్వర రాజు, చంద్రరావు, రామచంద్ర రెడ్డి, భవానీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీలు ప్రారంభించి ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరంలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

భీమవరం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భీమవరం వన్‌టౌన్ జీవీఆర్ కళ్యాణ మండపంలో ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఇన్విటేషనల్ ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ -2025 పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. నిర్వాహకుడు, జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, గౌరవాధ్యక్షుడు తోట బంగారయ్యలు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌కు ఆరు జిల్లాల నుంచి వంద మందికి పైగా క్రీడాకారులు విచ్చేశారని, విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఖరీదైన చందరంగం క్రీడా పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు.ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి శివప్రసాద్, జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, గ్రంధి రవితేజ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రత్యేక బహుమతి అందుకుంటున్న రంగరాజు

కార్టూన్ పోటీల్లో రిటైర్డ్ టీచర్‌కు ప్రత్యేక బహుమతి

ఉండి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాలాక్షి సాహిత్య మాసపత్రిక 16వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీమామిడిపూడి రామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి కార్టూన్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు రంగరాజు ప్రత్యేక బహుమతి అందుకున్నారు. ఆదివారం నెల్లూరులో ఈ బహుమతిని మండలి మాజీ ఉపసభాపతి, జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా బహుమతి తీసుకున్నారు.



బాస్కెట్‌బాల్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు కస్తూరిబా నగర పాలక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి బాలికల జట్టును ఎంపిక చేశారు. ఆగస్టు 14 నుంచి 17 వరకు కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగే ఆంధ్రప్రదేశ్ 10వ అంతర జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలలో వీరు పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.మురళి కృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎం.రమేష్ తెలిపారు.

ఎంపికైన విద్యార్థులు వీరే :

జయశ్రీ, యామిని, రుత్విక, పూజిత, సాయి భవానీ, నందిని, దేవిశ్రీ, జి.సరిత, ఎస్ ఖుషీ హాసిని, డి.సాయి శ్రీలాస్య, ఏ.రియా, పి.శాంతి, సులోచన ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా ఎన్.రేణుక, సత్యశ్రీ, కే.రుచిత, జి.యేసు ప్రశాంతి ఎంపికయ్యారు. చంద్రశేఖర్, రిటైర్డ్ హెచ్ఎం జిల్లా వీరభద్రరావు, స్కూల్‌హెచ్ ఎం.మాధవిలత, ఎస్.సాంబశివరావు, పీడీలు వై.సురేష్, గోపాల్, బి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

కుట్టు..మహిళల ఉపాధికి మెట్టు



మునునూరు కుట్టు శిక్షణ కేంద్రంలో పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత

మహిళల ఆర్థిక ఉన్నతికి టైలరింగ్ ప్రధాన ఆయుధంగా మారింది. మహిళల నాడి పట్టి, వారి అవసరాలను గుర్తించిన టీడీపీ ప్రభుత్వం పల్లె, పట్టణం అనే తేడా లేకుండా కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 62 కేంద్రాల్లో 7,301 మంది మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. మరో నెల పూర్తి అయితే శిక్షణకు తుది మెరుగులు దిద్దుకుని ఉపాధిబాట పట్టనున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- మహిళల ఆర్థిక ఉన్నతికి టైలరింగ్
- ఉమ్మడి జిల్లాలో 62 కేంద్రాలు...7,301 మందికి శిక్షణ
- ప్రతిభ చూపిన వారికి ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు

మహిళలు ఆర్థికంగా బలోపేతం అవడానికి కుట్టుశిక్షణ తొలి మెట్టుగా మారుతోంది. ఈబీసీ కార్పొరేషన్ ద్వారా అన్ని కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మూడు నెలలు టైలరింగ్ శిక్షణకు టీడీపీ ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు నివాసం ఉన్నచోటే సంపాదనకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు మూడు నెలలు పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు 62 కేంద్రాలను ఏర్పాటు చేయగా మహిళల నుంచి విశేష స్పందన లభించింది. స్థానికంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా దరఖాస్తులు ఆహ్వానించారు. వడపోత అనంతరం వివిధ శిక్షణా ఏజెన్సీల ద్వారా కేంద్రాలను వేగంగా ఏర్పాటు చేశారు. వేలకు, వేలుఖర్చుపెట్టి టైలరింగ్ శిక్షణ పొందలేని మహిళలు 7,301 మంది శిక్షణలో చేరారు. ఇప్పటికే రెండు నెలలు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో నెల పాటు శిక్షణ పొందిన వారికి వివిధ టెస్ట్‌లు పెట్టి వారికి ఉచితంగా ప్రభుత్వం కుట్టుమిషన్లను పంపిణీ చేయనుంది. ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారికి వివిధ స్పాన్సరింగ్ ఏజెన్సీల ద్వారా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణకు ఎంపిక చేయనున్నారు. దీంతో పాటు మెరుగైన ప్రతిభ చూపిన వారికి ఇతోధికంగా వివిధ యూనిట్ల స్థాపనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

ఈసారి సర్టిఫికెట్ ఆషామాషీ కాదు..

ఉచిత శిక్షణకు వచ్చిన మహిళలు మూడు నెలలు కాలంలో కనీసం 75 శాతం అటెండెన్సీ ఉండాలన్న నియమం పెట్టారు. అలా వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు. వీరికి ముఖ ఆధారిత హాజరును పరిగణనలోకి తీసుకుంటున్నారు. శిక్షణకు డుమ్మా కొట్టడానికి వీల్లేకుండా చేశారు. మహిళల వెసులుబాటు, ఇష్టం ప్రకారం ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 2 గంటల దాటాక రెండు బ్యాచ్‌లుగా ఆయా టైలరింగ్ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇదిలా ఉండగా కుట్టుశిక్షణ కేంద్రాలను నిరంతరం అధికారులు తనిఖీలు చేస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత ఉమ్మడి జిల్లాలోని కేంద్రాల పనితీరుపై స్థానిక ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. వారంలో కనీసం పది కేంద్రాలనైనా చుట్టి రావాల్సిందేనని బీసీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలతో తనిఖీల బాట పడుతున్నారు. శిక్షణ కేంద్రాల సక్రమంగా నడిపించే బాధ్యతను పూర్తిగా ఈడీపైనే పెట్టడంతో తీరిక లేకుండా ఆరా తీయడమే కాకుండా లోటుపాట్లను నివారించడానికి ఆమె స్వయంగా కార్య రంగంలోకి దిగుతున్నారు. కుట్టు శిక్షణ కేంద్రాల అంశంపై ఈడీ పుష్పలత 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అందరి సమన్వయంతో 62 కేంద్రాలను పారదర్శకంగా నడుపుతున్నామన్నారు. మహిళలు ఎంతో ఉత్సాహం, పట్టుదలతో శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకుంటున్నారు. శిక్షణ పూర్తయిన వారికి ప్రభుత్వం కుట్టు మిషన్లు కూడా అందిస్తుందన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె

కె.పెంటపాడు పెంట్లమ్మ అమ్మవారికి..

పెంటపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు మండలం కే.పెంటపాడు గ్రామదేవత పెంట్లమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పంతం శేఖర్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారికి చీర,సారె సమర్పించుకున్నారు.ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీలు సారె సమర్పించారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దాసరి కృష్ణవేణి, తోటరాజ, నరాలశెట్టి సంతోష్ కుమార్, సర్పంచ్ పీతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శాకంబరిగా పెంట్లమ్మ అమ్మవారు

భీమవరం మావుళ్లమ్మకి...

భీమవరం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మకి ఆదివారం పలువురు భక్తులు వెయ్యి కేజీల సారె అందించారు.పట్టణానికి చెందిన క్వీన్స్ కిట్టి మహిళలు 51 రకాలతో 250 కేజీలు, వీరవాసరానికి చెందిన భక్తులు 150, భీమవరానికి చెందిన పలువురు భక్తులు 200, ఆకివీడుకు చెందిన భక్తులు 220 కేజీల చొప్పున అమ్మవారికి సారెఅందించారని ఇవో మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.





అమ్మవారికి సారె అందిస్తున్న క్వీన్ కిట్టీ పార్టీ సభ్యులు... పెంట్లమ్మ అమ్మవారికి సారె అందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



తణుకులో జరిగిన బ్రాహ్మణ సేవా సంఘాల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు, యూత్ అధ్యక్షులను సత్కరిస్తున్న సభ్యులు

రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులు ఐక్యం కావాలి

తణుకు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులు ఐక్యం కావాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోసూరి సతీష్ శర్మ చెప్పారు. ఆదివారం తణుకులో జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య బైలాస్ సవరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ఏపీ బ్రాహ్మణ యూత్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపకుడు, కుర్తాళం పీఠాధిపతి ఆంజనేయులు స్వస్థలం తణుకులో బైలాస్ సవరణ సమావేశం జరగడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. సంఘ గౌరవ సలహాదారు సత్యవాద దుర్గా ప్రసాద్, బైలాస్ కమిటీ చైర్మన్ పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ హెచ్‌కే మనోహర్, కోశాధికారి పులిపాక ప్రసాద్, బలిజేపల్లి రవిశంకర్, మంత్రిరావు వెంకటరత్నం, తదితరులు మాట్లాడారు. పొన్నా సుధీర్ శర్మ, పార్థసారధి వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మొగల్తూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి సీతారామపురంలోని ఒక ప్రైవేట్ స్కూల్ వద్ద జాతీయ రహదారిపై ఆది వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువ కుడు మృతి చెందాడు. మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలం రుస్తుంబాద పంచాయతీ యడ్లపల్లివారి తోటకు చెందిన పరసా సాయి చందును (22) ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెనుగొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమండ్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెను గొండకు చెందిన వ్యక్తి మృతి చెందారు. పెనుగొండకు చెందిన పూతినీడి ఏడుకొండలు (59) ఈనెల 8వ తేదీన రాజమండ్రిలో నడిచి వెళుతుండగా మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఏడుకొండలు తీవ్ర గాయాల పాలయ్యాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం,జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని వ్యక్తి మరణించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెంకు చెందిన కొత్తపల్లి అశోక్ (30) శనివారం రాత్రి భీమడోలు రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందాడన్నారు. రైల్వే పోలీసులు మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం..కేసు నమోదు

టి.నర్సాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. మండలంలోని వల్లంపట్ల పంచాయతీ సింగారాయిపాలెం గ్రామానికి చెందిన గొర్రె అనంత (30) భర్త శ్రీనివాస్‌తో గొడవపడి రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గ్రామాల్లోనూ, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికి ఆమె ఆచూకి లభ్యం కాలేదు. ఆమె తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 94407 96676 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెదపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం వేంపాడుకు గ్రామానికి చెందిన వివాహిత మన్నెపు హారిక సుధ ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడతో చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని ఆమె తల్లి మందపాక సుజాత ఆదివారం పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ గజపతిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తణుకు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తణుకు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామానికి చెందిన గుంటూరి సూర్య కుమారి (38) ఆదివారం సాయంత్రం తన పిన్ని భూపతిరాజు లక్ష్మీతో కలసి స్కూటీపై తేతలి నుంచి తణుకు డీమార్ట్‌కు వెళ్లే క్రమంలో జాతీయ రహదారి పాత టోల్ గేట్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో పెరవలి నుంచి తణుకు వైపు వస్తున్న టెంపో మినీబస్ వేగంగా ఢీకొనడంతో సూర్యకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. తణుకు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు తెలిపారు. వెనక వున్న లక్ష్మీకి స్వల్ప గాయలైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధరరావు.. హాజరైన వివిధ జిల్లాల సంఘ నాయకులు

నిబంధనల ప్రకారం పెన్షన్ ఇవ్వాలి

రిటైర్డ్ అధ్యాపకుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఏలూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల అధ్యాపకులకు నిబంధనల ప్రకారం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆదివారం ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో చర్చించిన అంశాలు, డిమాండ్లు, తీర్మానాల వివరాలను సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లేళ్ల వెంకటేశ్వరరావు స్థానిక మీడియాకు తెలియజేసారు. కళాశాలల్లో ట్యూటర్లు, డెమాన్‌స్ట్రేటర్లుగా పనిచేసినవారికి 9 శాతం పారితోషికం ఇవ్వాలని కోరారు. అధ్యాపకులకు బకాయివున్న డీఆర్‌లను చెల్లించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. తొలుత లెక్చరర్స్ ఉద్యమ పితామహుడు, టీచర్స్ మాజీ ఎమ్మెల్సీ ఎం.జే.మాణిక్యరావు శత జయంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.గంగాధరరావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.కృష్ణారావు, డాక్టర్ జి.ఆర్.కె.రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ నరసయ్య, సలహాదారులు లక్ష్మీపతి, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, లీగల్ కన్వీనర్ రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాని యేల్, మాజీ అధ్యక్షుడు రామ కృష్ణారెడ్డి, సంఘ ఏలూరు యూనిట్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, కోశాధికారి పి.ఆంజనేయులు, వీర భద్రరావు, బ్రహ్మేశ్వరి,ఉత్తమ దుర్గ, రాంబాబు, వివిధ కళాశాలల ప్రిన్సి పాల్స్, వివిధ జిల్లాల నుంచి సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

బిల్లుకు అదనంగా ఎటువంటి చార్జీలు ఉండవు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



ఏలూరుసిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవలలో పారదర్శకతను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రారంభించిందని అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్‌సీ ఆమోదం తెలిపిందన్నారు. ఏపీఈఆర్‌సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల విని యోగదారులకు వీటిని బిగిస్తున్నామని చెప్పారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా బిగిస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగ దారులు వాటి ఖరీదు కాని , చార్జీలు కాని, మమూళ్ళు గాని చెల్లించనవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్ కన్సూమర్ యాప్ ద్వారా 24 గంటలూ కనెక్ట్ అయి ఉంటాయని, ఫలితంగా వినియోగదారులు తమ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసు కోవచ్చునని చెప్పారు. పైగా అధిక వినియోగాన్ని నియంత్రించుకొంటూ విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు సహక రిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియో గదారులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబరు 11912లో సంప్రదించవచ్చునని పృథ్వీతేజ్ తెలిపారు.

పుట్టినరోజు విషెస్ చెప్పలేదని టీచర్ ఆత్మహత్య

భార్య మృతి తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం



దేవిక, సురేంద్ర దంపతులు(ఫైల్ ఫొటో)





ఆత్మహత్య చేసుకున్న టీచర్ దేవిక.. తీవ్రగాయాల పాలైన సురేంద్ర

ఏలూరు క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భర్త పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపలేదనే మన స్థాపంతో భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏలూరు శివారు చొదిమెళ్లలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ముందాడ దేవిక (38), చిన్ని సురేంద్ర ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. వీరికి ఇంటర్, టెన్త్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. విజయవాడ హాస్టల్లో ఉంటున్నారు. దేవిక ఉంగుటూరు మండలం నల్లమాడులో పనిచేస్తుండగా సురేంద్ర అదే మండలం రాచూరులోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 19న దేవిక పుట్టిన రోజు.. ఆమె యథావిధిగా పాఠశాలకు వెళ్లిపోయింది. సురేంద్ర కూడా విధులకు వెళ్లారు. తిరిగి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. ఇల్లు గడియ పెట్టి ఉండటంతో సురేంద్ర తలుపులు తీసి చూడగా దేవిక ఉరి వేసుకుని ఫ్యానుకు వేలాడుతూ కన్పించింది. భార్య మృతిని జీర్ణించుకోలేని సురేంద్రబాబు చేతులను, కాళ్లను బ్లేడుతో కోసుకుని రక్తంతో భార్య నుదిటిపై తిలకం దిద్దాడు. ఆ తరువాత గోడపై రక్తంతో ఐ లవ్‌యూ దేవిక అని రాశాడు. జాగ్రత్తగా ఉండాలని, బాగా చదువుకోవాలంటూ గోడపై రాశాడు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయాక గుర్తించిన స్థానికులు ఆయన్ను ఆసుపత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో విషయం తెలుసుకున్న దేవిక తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం సురేంద్ర చికిత్స పొందుతున్నాడు. ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు ఆదివారం ఆసుపత్రికి చేరుకుని పరామ ర్శించారు. ఇద్దరూ ఆదర్శదంపతులని, ఎలాంటి గొడవలూ లేవని ఇలా చేసుకోవడం ఆశ్చ ర్యంగా ఉందని చెబుతున్నారు. ఈ కేసును పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్.ఐ. దుర్గా ప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న సురేంద్ర వద్ద ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయలేదని భర్తపై అలిగి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ప్రాథమికంగా తెలిసిందన్నారు. ఇంకా ఏమైనా బలమైన కారణాలున్నాయా అనే దానిపై విచారణ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని దేవిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

షైనీకి 'మల్టీ టాలెంటెడ్ షైనింగ్ స్టార్' అవార్డు



ఆకివీడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కరాటే బ్లాక్ బెల్ట్ గంటా షైనీకి 'మల్టీ టాలెంటెడ్ షైనింగ్ స్టార్' అవార్డు లభించిందని కోచ్ గంటా శ్రీను తెలిపారు. విజయవాడ గెజ్జల సరళాదేవి హాల్‌లో వైఎంకే అకాడమీ నిర్వహించిన నేషనల్ షైనింగ్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో సినీ నటుడు భానుచందర్ చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందుకుంది. అకాడమీ ఛైర్మన్ సుమన్, గల్లా రూపాస్ ఉన్నారు.

కనక దుర్గమ్మకు 93 గ్రాముల వెండి బహూకరణ



భీమవరంటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి):మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి దాతలు 93 గ్రాముల వెండి విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన సింహాద్రి పెద్దిరాజు, రమ్యశ్రీ దంపతులు 50 గ్రాములు, తోట రామ్మూర్తి, వెంకట పద్మావతి దంప తులు 43 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు.



చైర్మన్ సాయిరమేష్‌తో సంతకం చేయిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, గన్ని, బాబ్జి

సొసైటీ బలోపేతానికి కృషి చేయాలి

పెంటపాడు, జూలై 20(ఆంధ్రజ్యోతి):కొత్తగా నియామకమైన పాలకవర్గ సభ్యులు సొసైటీ బలోపేతానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కోరుమిల్లి గ్రామ సొసైటీలో చైర్మన్‌గా వల్లూరి సాయిరమేష్, సభ్యులుగా కొండ్రెడ్డి బుల్లిరాజు, జేష్ఠ వెంకటసుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో పాలకవర్గ సభ్యులను అడ్డుపెట్టుకుని పెద్దఎత్తున అవినీతి జరిగిందని విచారణ జరిపి ప్రతీ పైసా సొసైటీకి వచ్చేలా చూస్తామన్నారు. ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడారు. టైలరింగ్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, తణుకు మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకటకృష్ణారావు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, సర్పంచ్ గారపాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్ గుప్తా, రామ్మూర్తి



లక్ష్మణ్ గుప్తా.. రామ్మూర్తి

తణుకు రూరల్/కాళ్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ తణుకు రూరల్ మండల మాజీ అధ్యక్షుడు సింహాద్రి లక్ష్మణ్‌కుమార్ గుప్తాను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్టు తెలిపారు. ఆదివారం భీమవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఎన్నుకున్నట్టు తెలిపారు. ఆయన స్వగ్రామం దువ్వ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాళ్ల మండలం పెద అమిరం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కోరా రామ్మూర్తిని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. పెద అమిరం గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం బీజేపీ ఉండి నియోజకవర్గ సమన్వయకర్తగా, సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జడ్ఆర్ యూసీసీ మెంబర్‌గా ఉన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినోద్ వర్మ



భీమవరంటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కలిదిండి వినోద్ వర్మను నియమించారు. పార్టీ పటిష్టతకు ఆయన చేసిన కృషి, అంకితభావాన్ని గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతలను ఆయనకు అప్పగించింది. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అడుగుజాడల్లో నడుస్తూ, 15 సంవత్సరాల క్రితం బీజేపీలో సాధారణ కార్యకర్తగా చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చారు. 2023లో జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, జిల్లాలో యువ మోర్చా బలోపేతానికి విశేషంగా కృషి చేశారు.

'కాపులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'



మాట్లాడుతున్న చలమల్ల ప్రసాదరావు

తణుకు రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారికి నామినేటెడ్ పదవుల్లో 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి, కాపు రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు అన్నారు. ఆదివారం కొమరవరం కేఆర్‌పీఎస్ కార్యాలయంలో జరిగిన కేఆర్‌పీఎస్ కార్యకర్తల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు కాపుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, కో ఆర్డినేటర్‌లు అమ్మా శ్రీనివాసనాయుడు, జానపాముల నాగబాబు, రాష్ట్ర కో కన్వీన ర్‌లు బోడపాటి పెదబాబు, కాకిలేటి హరినాథ్, పంచాది రంగారావు, వంగా ఆంజనేయులు, మెర్ల నాగ సత్యనారాయణ మాట్లాడారు.



వెలివర్రులో సత్యనారాయణను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

ఉండి రూరల్ బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణకు సన్మానం

ఉండి, జూలై20(ఆంధ్రజ్యోతి):ఉండి రూరల్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికైన గురుగుబిల్లి వెంకట సత్యనారాయణను టీడీపీ మండల నాయకులు సత్కరించారు. ఆదివారం వెలివర్రు వీరపేరంటాలమ్మ ఆలయం వద్ద ఆయనను సత్కరించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, పేరిచర్ల బాలరాజు ఉండి డీసీ వైస్ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు కందుల రాధాబలరామకృష్ణ తదితరులు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఉండి రూరల్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన కనకరాజు సూరి హయంలో నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు మజ్జి కృష్ణప్రసాద్, కర్రి శ్రీను, గొట్టం బాబి పాల్గొన్నారు.

ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

మండలంలోని గ్రామాలకు ప్రయాణం సులభతరం కానుం ది. నవాబ్‌పాలెం వద్ద రైల్వేగేట్ వేస్తే వందల సంఖ్యలో లారీలు, మోటారు సైకిళ్లు నిలిచిపోతున్నాయి. ఈ ప్రాంతాల నుంచే ఎర్ర కంకర జిల్లా వ్యాప్తంగా రవాణా అవుతోంది. గేట్ వేసిన ప్రతిసారి వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎంతో కాలంగా ఈ ప్రాంత వాసులు ఆర్‌వోబీ ఏర్పాటు చేయాలని మొర పెట్టుకున్నారు. ఆరుళ్ల నుంచి జగన్నాధపురం రోడ్డులో మరో ఆర్‌వోబీ నిర్మించనున్నారు. దీనితో నిడదవోలు, తణుకు మండ లాల నుంచి తాడేపల్లిగూడెం మండలంతో పాటు నల్లజర్ల, దేవరపల్లి మండలాలకు వెళ్లేవారి ప్రయాణం సులభతవరం అవుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు.

ఆర్‌యూబీలు ఇక్కడ

పట్టణంలోని జువ్వలపాలెం ఫుట్‌పాత్ బ్రిడ్జి పక్కగా కుంచనపల్లి మార్గంలో ఆర్‌యూబీ నిర్మాణానికి రైల్వే అధికారులు ప్రతిపాదించారు. నిత్య రద్దీగా ఉండే ఈ ప్రాంతం ఆర్‌యూబీ నిర్మాణంతో అభివృద్ధి పథంలో సాగనుంది. ఇక్కడ అసలు ఆర్‌వోబీ ఏర్పాటు చేయా లని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పట్టుబట్టారు. ఆర్‌వోబీ నిర్మాణంతో వాహనాలు పట్టణానికి రాకుండా కుంచనపల్లి మీదుగా హైవేకి మార్గం కల్పించాలని ఆయన ప్రతిపాదించారు. వాహనాల తాకిడి, రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్‌వోబీ నిర్మాణం చేపడతారు. కాలువ కూడా రైల్వే ట్రాక్‌కు దగ్గరగా ఉండడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆర్‌వోబీకి అనుమతి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఆర్‌యూబీ నిర్మా ణానికి రైల్వే అధికారులు నిర్ణయించారు. ఇక మరో ఆర్‌యూబీ మారంపల్లిలో నిర్మించనున్నారు. మారంపల్లి నుంచి పొలాల్లోకి వెళ్లే మార్గంలో ఆర్‌యూబీ ఏర్పాటు చేస్తున్నారు. దీనితో ఆరుళ్ల, మారంపల్లి, జగన్నాథపురం, నందమూరు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలు





నరసాపురంలో కరపత్రాలు అందిస్తున్న ఎంఏ షరీఫ్, పొత్తూరి, కొల్లు

చిలుకూరులో ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందిస్తున్న నాగరాజు

నరసాపురం టౌన్, జూలై20(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పాలన సాగిస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ప్రభుత్వ మైనార్టీ సలహాదారు ఏంఏ షరీఫ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 7, 12వ వార్డుల్లో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై అవగాహన కల్పించారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, ఆచ్యుతామయ్య, నంకు భాస్కర్, వాతాడి ఉమా, నంద్యాల బాబు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. ఆదివారం పట్టణంలోని 22వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, ఆకాశపు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

● ఉండి: డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు అన్నారు. ఆదివారం చిలుకూరులో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాలువ, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేగేశ్న సత్యనారాయణరాజు, సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు, పెన్మెత్స భీమరాజు, నంబూరి వెంకట్రాజు, ఇందుకూరి నవీన్‌వర్మ, తిరుపతిరాజు, సత్యనా రాయణరాజు, టీడీపీ మండల ప్రధాన కార్య దర్శి ఉపాధ్యక్షుడు కళ్లేపల్లి సతీష్‌రాజు, వర్రే సముద్రమూర్తి, పేరిచర్ల బాలరాజు పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

రెండోరోజు ఆక్రమణల తొలగింపు

ఆకివీడు, జూలై 20(ఆంధ్రజ్యోతి) : కోర్టు ఆదేశాలతో రెండో రోజు ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో అధికారులు ఆక్రమణలు తొలగించారు. ధర్మాపురం అగ్రహారంలో మంచినీటి చెరువు గట్టున ఉన్న 26మంది ఆక్రమణదారుల ఇళ్లను పోలీసుల సమక్షంలో శనివారం 23 ఇళ్లను తొలగించిన సంగతి తెలిసిందే. ఆదివారం మిగిలిన మూడు ఆక్రమణలు తొలగించారు. సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజు ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్, మేనేజర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, పోలీసులు ఉన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశామని రూరల్ ఎస్ఐ జేవీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.18,200 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.



చిత్ర కళాకారుడు రాజశేఖరన్‌ను సత్కరించిన కేంద్ర మంత్రి వర్మ

కళాకారులను ప్రోత్సహించడం సామాజిక బాధ్యత

భీమవరంటౌన్,జూలై 20 (ఆంధ్రజ్యోతి): చిత్రకళలకు ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చే గొప్ప శక్తి ఉందని, కళలను ప్రోత్సహించడం సామాజిక బాధ్యత అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆదివారం భీమవరంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో భీమవరం ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోర్ట్రెట్ డెమో కళా ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలను తిలకించి అభినందించారు. ముఖ్యంగా ఈ ప్రదర్శనలో ఉంచిన ఆయిల్, ఆక్రిలిక్, వాటర్ కలర్స్, త్రెడ్ ఆర్ట్‌తో వేసిన పలు చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రశంసలు పొంది, రెండు గిన్నిస్ రికార్డులను సాధంచిన కేరళకు చెందిన చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్‌ను ఘనంగా సత్కరించారు. కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, సెక్రటరీ పీవీ రామరాజు, ఉపాధ్యక్షులు ఎం.సుబ్బరాజు, సహాయ కార్యదర్శి కన్నబాబు, కె.వెంకట రాజు, రామరాజు, ఆర్. సుబ్బరాజు, చిత్ర కళాకారులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకురాలు రాధను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న తాతాజి

బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేద్దాం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేద్దామని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజి పేర్కొన్నారు. మెట్టఉప్పరగూడెంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్ నివాసం వద్ద ఆదివారం మండల అధ్యక్షుడు నమయమంతుల కాశీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలు నూనే రాధ, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి కలగాని ప్రభాకర్‌లకు బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షుడు పత్సా రామకృష్ణ, నియోజకవర్గ కో-కన్వీనర్ రామగాని సత్యనారాయణ, కొల్లి రాజశేఖర్ పాల్గొన్నారు.

సిద్ధాపురంలో 80 మందికి కళ్లజోళ్ల అందజేత

ఆకివీడురూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం గ్రామంలో గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా వారి సౌజన్యంతో 80మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈనెల 6వతేదీ జరిగిన కంటి చికిత్స శిబిరంలో ఎంపిక చేసిన 80మందికి ఆదివారం కళ్ళజోళ్ళను అందజేసినట్టు ఫౌండేషన్ సిద్ధాపురం ఇన్‌ఛార్జి భూపతిరాజు వెంకటేశ్వరరాజు తెలిపారు. మరి కొంతమందికి శస్త్ర చికిత్సలు చేసినట్టు తెలిపారు. గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

750 మందికి చికెన్ బిర్యానీ పంపిణీ

పెనుగొండ, జూలై20(ఆంధ్రజ్యోతి):పెనుగొండ శ్రీభవాని పీఠం గురుభవాని పిల్లి శంకరం గురుమాత పిల్లి దుర్గమ్మ ఆధ్వర్యంలో విజయ దుర్గభవాని ఆలయం వద్ద ఆషాఢం సందర్భంగా 750 మందిక చికెన్ ధమ్ బిర్యాని వితరణ చేశారు. సుమారు 34 ఏళ్ల నుంచి ఆషాడంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సర్పంచ్ నక్కా శ్యామలాసోనిశాస్త్రి, పిల్లి శివయ్య, చిన్న శంకరం, తెలంగాణ డప్పు శ్రీను పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ధర్మరాజును గజమాలతో సత్కరిస్తున్న మొయ్యేరు సొసైటీ పాలకవర్గం, కూటమి నేతలు

సహకార వ్యవస్థను బలోపేతం చేస్తాం : ధర్మరాజు

గణపవరం, జూలై20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో సహకార వ్యవస్థను బలోపేతం చేసి అన్నిరకాల సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఆరు విశాల వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ సభ్యుల పాలకవర్గల అభినందన సభ ఆయా సొసైటీల్లో ఘనంగా నిర్వహించారు. కాశీపాడు సొసైటీ చైర్మన్‌గా కొలనువాడ శ్రీనివాసరాజు, మొయ్యేరు సొసైటీ చైర్మన్‌గా కానుమిల్లి వెంకటేశ్వరరావు, జల్లికొమ్మర సొసైటీ చైర్మన్ మద్దాల మహంకాళి, కోమర్రు సొసైటీ చైర్మన్ చినరత్తయ్య, జల్లికాకినాడ సొసైటీ చైర్మన్‌గా ఇందుకూరి అశోక చక్రవర్తిరాజు, డీకేవల్లి సొసైటీ చైర్మన్‌గా దాసం వెంకటేశ్వరరావులతో పాటు ఆయా సొసైటీల డైరెక్టర్లకు అభినందన, సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును ఆయా సొసైటీ పాలకవర్గ సభ్యులు, చైర్మన్‌లు ఘనంగా గజమాలలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, వంగా రఘు, చింతలపాటి బాసిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా బంగార్రాజు

భీమవరంటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రామైన గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానం అభివృద్ధికి నూతనంగా ఏర్పాటవుతున్న పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా చింతలపాటి బంగార్రాజు నియమితులైన సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబును కలిసి సత్క రించారు. చైర్మన్ బంగార్రాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం బంగార్రాజును అభినందించి సత్కరించారు. శివరావుపేట వాస్తవ్యులు, కూటమి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

'ఆరోగ్యమే మహాభాగ్యం'

పాలకోడేరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని, ఓ వయస్సు వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ ఆరోగ్య లక్షణాలపై అవగాహన పెంచుకుంటే తద్వారా జీవన విధానాన్ని మెరుగుపర్చుకోవచ్చని వైద్యులు సూచించారు. పాలకోడేరు శివారు గోస్తనీ నది ఒడ్డున పాలకోడేరు, మోగల్లు, ఉషోదయ వాకర్స్ మహిళా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్‌ను గాదిరాజు కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. భీమవరం నుంచి విచ్చేసిన వైద్యులు డాక్టర్ జె.శివకుమార్, డాక్టర్ యు.నాగరాజు, డాక్టర్ శిరిపురపు యుదిష్టర్, డాక్టర్ వెంకటేశ్వరరాజు వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు, గ్రామస్థులకు వైద్యంపై సూచనలు, అందించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు గాదిరాజు బాబు, గుంటూరి రామరాజు, కొత్తపల్లి సూర్యనారాయణరాజు, పి.సీతారామరాజు, కలిదిండి సందీప్ వర్మ, ఎస్‌ఎస్ రాజు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎస్ఐ ఆకివీడు ఫీల్డ్ కౌన్సిల్ సభ్యుడిగా చాంబర్లీన్



ఆకివీడురూరల్ జూలై 20(ఆంధ్రజ్యోతి) : చెరుకుమిల్లిలోని చెరుకుమిల్లి సీఎస్ఐ ఆకివీడు పారిస్ ఫీల్డ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎరిచర్ల చాంబర్లీన్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికలో 101మంది పాల్గొనగా 24 ఓట్ల తేడాతో గ్లాడ్‌సన్‌పై ఎరిచర్ల చాంబర్లీన్ గెలుపొందారు. ఆయన మూడోసారి ఎన్నికయ్యారని, మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. చెరుకుమిల్లి, సిద్ధాపురం సర్పంచ్‌లు నందమూరి ప్రకాష్, చిట్టిబాబు, జయపూర్ణ, వల్లూరి రత్నభూషణం, బుంగ జాన్, మేడేపల్లి ప్రశాంతరాజు, మానకొండ సువర్ణరాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



ఆకివీడులో మారెమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు.. కొలనపల్లిలో ముత్యాలమ్మకు సారె.. దువ్వ పుంతలో ముసలమ్మకు ఆషాఢం సారె

అమ్మవార్లకు ఆషాఢ సారె

కాళ్ళ/ఆకివీడు/పాలకోడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాళ్ల మండలం కొలనపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మకు ఆషాఢ మాసం దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సారె సమర్పించారు. సుమారు 500 కేజీలతో తయారు చేయించిన పలురకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులతో, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం నిర్వహించి సారె సమర్పించారు. ఆకివీడు గంగానమ్మ కోడు వీధిలోని దండు మారెమ్మకు భక్తులు ఆషాఢం బోనాలు సమర్పించారు. పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామ దేవతలైన పోలేరమ్మ, పార్వతిదేవిలకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు సారెను సమర్పించారు. స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

● తణుకు రూరల్ : దువ్వ గ్రామంలోని పుంతలో ముసలమ్మకు ఆదివారం ఆషాఢం సారె, చీర, పసుపు, కుంకుమలను సమర్పిం చారు. ఉప సర్పంచ్ కడియం వీరబాబు, వావి లాల సరళాదేవి, గ్రామ భక్తులు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : కొండ్రుప్రోలులో అంకాలమ్మకు ఆషాడం సారె వేడుక ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పుట్టింటి పొలమోలు వెంకటేశ్వరరావు, అత్తింటి నుంచి బొట్టా శ్రీను ఆధ్వర్యంలో సారె సమర్పించారు.

● భీమవరంటౌన్: భీమవరం గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవారి ఆషాఢ మాసం సందర్భంగా యర్రంశెట్టి వాసు-వెంకట రమణ దంపతులు, వారి కుటుంబ సభ్యులు 150 రకాల పండ్లు, స్వీట్లు సారె అందించారు.

● పెనుగొండ/ఆచంట/మొగల్తూరు :

పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆసాఢ సారెను సిద్ధాంతం ఆర్యవైశ్య సంఘం సభ్యులు సమర్పించారు. అమ్మవారిని పలు రకాల పండ్లు, కూరగాయలతో శాకంబరీ అలంకరణ చేసి పూజలు చేశారు. ఆచంట మండలం పెదమల్లం శ్రీమాచేనమ్మ ఆలయంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు.